www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 25 మే 2024

ఎపిజిబి చైర్మన్‌ను కలిసిన రెడ్‌క్రాస్ అధికారి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నూతనంగా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సత్య ప్రకాష్ సింగ్‌ను గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రెడ్ క్రాస్ అధికారి శివ శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ బ్యాంకులలో కెల్లా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నిరర్థక ఆస్తులను తగ్గించుటలోనూ, లాభార్జనలోనూ ముందంజలో ఉందని తెలిపారు. నూతన చైర్మన్ సారథ్యంలో మరింత ముందుకు సాగి నంబర్ వన్ స్థానంలో నిలువాలని ఆకాంక్షించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సేవల గురించి వివరించారు. రక్తదానం గురించి అవగాహన కల్పించుట, రక్తదాన శిబిరాలు నిర్వహించుట, రక్త గ్రూపులు తెలియచేయుట, పకృతి వైపరిత్యాలలో బీద బాధితులను ఆదుకోవటం, మొక్కలు నాటు కార్యక్రమం, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తుందని చెప్పారు. మరిన్ని సేవలు గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా అందించేందుకు గ్రామీణ బ్యాంక్ వారి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ కూడా గ్రామీణ బ్యాంక్ వ్యాపారాభివృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తుందని తెలిపారు.

వ్యవసాయ రంగం కుదేలు

- వ్య.కా.స అఖిల భారత సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వలన వ్యవసాయ రంగం కుదేలవుతున్నదని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ అన్నారు. వ్యవసాయ కార్మికుల జీవితాల్లో గణనీయమైన అభివృద్ధి జరగాలంటే భూ సంస్కరణలు అమలు జరగడమే మార్గమని అందుకోసం వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్త ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. శనివారం అన్నమయ్య జిల్లా హార్సిలీహిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యల పరిస్కారం కోసం దేశవ్యాప్త ఉద్యమాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి విదానాలకు, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాలు పెద్దఎత్తున పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇందుకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం విశేషమైన కృషి చేసిందని తెలిపారు. వ్యవసాయ ఉద్యమాలు మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో దేశారాజధాని ఢిల్లీలో నూతన కార్యాలయ భవన నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. ఈ భవన నిర్మాణానికి వ్యవసాయ కార్మికులు నిధులు అందించి సహకరించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర

సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్ సింగ్

కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి పని ప్రదేశాల్లో పర్యటలు చేసి సమస్యలు గుర్తించి వాటి పరిస్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రతి నాయకుడు పనిప్రదేశాల్లోకి వెళ్లి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, రవి, నారాయణ, పుల్లయ్య, అన్వేష్, ఓబులరాజు, పెద్దన్న, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని భువనగిరిపల్లె శ్రీ లక్ష్మీ నారసింహ స్వామివారి కల్యాణం శుక్రవారం వేదపండితులు మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారులు వీర ప్రదీప్ కుమార్, వీరపవన్ కుమార్ సతీసమేతంగా ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. లక్ష్మీ దేవిని నరసింహస్వామి పరిణయమాడిన ఘట్టాన్ని నిర్వహించారు. తొలుత పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా ము స్తాబైన స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి వేర్వేరు వాహనాలపై మండపం వద్దకు తీసుకొని వచ్చి గరుడ వాహనంపై కొలువు తీర్చి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కళ్యాణ మహోత్సవానికి భువనగిరిపల్లి గ్రామ ప్రజలతో పాటు రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి పరవశించారు. భువనగిరిపల్లి లక్ష్మీ నారసింహ ఆలయ ప్రాం గణం, కల్యాణ వేదిక ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులందరికీ ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేశారు. స్వామివారి తలం బ్రాల కోసం భక్తులు పోటీ పడడంతో భక్తుల మధ్య

పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న పసుపులేటి సోదరులు

తోపులాట జరిగింది. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న వానిరి అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రహ్మణ్యం, జనసేన నేత అతికారి కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మిట్స్' సిఎస్‌టి విభాగానికి ఎన్‌బిఎ గుర్తింపు

ఎన్‌బిఎ అక్రిడేషన్ పత్రాలను చూపుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, టెక్నాలజీకి నేషనల్ బోర్డు అఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభిచిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ అక్రిడిటేషన్ 2024-25 సంవత్సరం నుంచి 2026-27 మూడు సంవత్సరాల పాటు లభించిందని తెలిపారు. కలశాలలోని అండర్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాంలైన సివిల్, ఇఇఇ, ఇసిఇ, సిఎస్‌సి, మెకానికల్ ఇంజినీరింగ్‌కు పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్స్ అయిన ఎంసిఎ, ఎంబిఎ ప్రోగ్రామ్స్‌కు ఇదివరకే నేషనల్ బోర్డు అఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు ఉన్నదని ఇప్పుడు అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామైన కంప్యూటర్ సైన్స్, టెక్నాలజీకు కూడా గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. అకడమిక్ ప్రోగ్రామ్‌ల యొక్క అన్ని అంశాలను మూల్యాంకనం చేసి, క్యాంపస్‌కు ఎన్‌బిఎ నిపుణుల కమిటీ ఇటీవల తనిఖీ చేసి ఈ అక్రిడిటేషన్ లభించిందన్నారు. ఈ అక్రిడిటేషన్ ద్వారా తమ కలశాలలోని విద్యార్థులు ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో హయ్యర్ ఎడ్యుకేషన్ అడ్మిషన్లు, ప్రముఖ బహుళ-జాతీయ కంపెనీలలో ఉపాధిని పొందడంలో సహాయపడుతుందని తెలిపారు. మూల్యాంకనం వాషింగ్టన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని చెప్పారు. ఈ గుర్తింపు లభించడానికి కృషి చేసిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కృతతలు తెలియజేసారు. కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, పార్క్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌ఓ మోహన్‌రావు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరగాలని, ఇందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని, అలా కాకుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని రాజంపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.మోహన రావు, డిఎస్‌పి వి.ఎన్.కె.చైతన్య అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సభా భవనంలో శుక్రవారం రాజకీయ నేతలతో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 288 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇందుకు అనుగుణంగా 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 20 రౌండ్లు లెక్కిస్తామన్నారు. ఓట్ల లెక్కింపుకు సంబందించి సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్లు కోసం ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏజెంట్ల కోసం ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 4న రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఉంటుందని, లెక్కింపు సజావుగా జరిగేలా ప్రతి టేబుల్ వద్ద సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్వైజర్‌తో పాటు మరొక సహాయకులు ఉంటారని, ఎన్నికల సిబ్బందికి ఏజెంట్లు సహకరించాలని కోరారు. ఫలితాలు వెలువడిన తర్వాత ఎవరూ కూడా బాణాసంచా పేల్చడం, విజయోత్సవ సంబరాలు చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్‌లోని సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మదనపల్లి : ఎన్నికల్లో పోటీ చేసిన అందరూ అభ్యర్థులు శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేయాలని రెవెన్యూ డివిజినల్ అధికారి, మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్, డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మదనపల్లి సబ్ కలెక్టర్ కాలయంలో నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు, ఎన్నికల ఏజెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4న జరగబోయే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అభ్యర్థుల కర్తవ్యం గురించి వివరించారు. శాంతి భద్రతల విషయంగా ఎటువంటి ఆటంకాలు జరగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అందరికీ తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రిమ్స్‌లో కంటి విభాగాన్ని పరిశీలించిన జెడి

ప్రజాశక్తి కడప అర్బన్

ఎన్‌పిసిబి జాయింట్ డైరెక్టర్ విజయవాడ డాక్టర్ సునీల్ నాయక్ శుక్రవారం కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న కంటి విభాగాన్ని సందర్శించారు. ఐఒపిలో కంటికి సంబంధించి ఏమేమి పరికరములు ఉన్నాయి, ఇంకేమైనా పరికరములు కావాలా అని కంటి విభాగంలోని డాక్టర్స్‌తో, హెచ్‌ఒడితో చర్చించారు. ఇంకేమన్నా కావాలనా అని అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ థియేటర్లో ఇన్స్ మెంట్స్ ఏమేమి ఉన్నాయ, వాటి పనితీరు గురించి తెలుసుకున్నారు. ఒపి ఎంత మంది వస్తున్నారు వివరాలు తెలుసుకున్నారు. తర్వాత డిస్టిక్ బ్లైండ్ కంట్రోల్ సొసైటీలో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు అందరికీ స్కూల్ స్క్రీనింగ్ ఏ విధంగా చేయాలి, ఎలా చేస్తే బాగుంటుంది, కాట్రాక్ట్ ఆపరేషన్ ప్రోగ్రామ్ని ఏ విధంగా స్టెప్ ఆన్ చేయాలా, స్కూల్ స్క్రీనింగ్ చిల్డ్రన్ ప్రోగ్రామ్ను ఏ విధంగా స్టెప్ ఆన్ చేయాలా అనే దాని గురించి చర్చించారు. ఆప్తమిక్ ఆఫీసర్స్ వాళ్ళ జాబ్ చాట్ గురించి వాళ్ళ విధివిధానాల గురించి తెలుసుకున్నారు. సమస్యలు ఏమన్నా ఉంటే చెప్పాలని కోరారు. కార్యక్రమంలో డిబిసిఎస్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సునీత, రవికుమార్ డి.సుధాకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రిమ్స్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ కంభం చిన్నయ్య, విజయ్ కుమార్, వివిధ పీహెచ్సీ ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

డిజిటలైజ్ చేసిన తాళపత్ర గ్రంథాలు బ్రౌన్ పరిశోధనా కేంద్రానికి అప్పగింత

ప్రజాశక్తి-కడప అర్బన్

శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంలో తాళపత్ర పరిరక్షణ విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తాళపత్ర గ్రంథాలను డిజిటైజ్ చేసి వైవీయూ సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి శుక్రవారం అప్పగించింది. యోగివేమన విశ్వవిద్యాలయం సి.పి.బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంతో గతేడాది అక్టోబర్ 10న ఎంఒయు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మార్గదర్శకం మేరకు బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి గ్రంథాలయంలోని తాల పత్రాల డిజిటలైజేషన్‌కు 173 బండిల్స్‌లో గల 288 తాళపత్రగ్రంథములను వేద విశ్వవిద్యాలయానికి అందచేశారు. వారు డిజిటలైజేషన్ చేసి సంబంధించిన పెన్ డ్రైవ్‌ను ఆచార్య రాణిసదాశివమూర్తి సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఒయు ప్రకారము గ్రంథాలను ఉచితంగా క్లీనింగ్, ఆయిలింగ్, ఇంకింగ్ చేశారని అన్ని వివరాలతో డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. జ్ఞానరక్షణ యజ్ఞమును నిర్వహించిన శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయానికి బ్రౌన్ గ్రంథాలయం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కౌంటింగ్‌కు మూడంచెల భద్రత

- జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కట్టుదిట్టమైన భద్రత నడుమ సజావుగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంసిసి అమలు, 144 సెక్షన్ పాటింపుపై రాజంపేట పార్లమెంట్ అభ్యర్థులు, ప్రతినిధులతో ఎస్‌పి బి.కృష్ణారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు, ఏజెంట్లు పాటించాల్సిన విధానాలపై ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రాజకీయ పార్టీ అభ్యర్థులు, ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. రాయచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన ఇవిఎంలను అత్యంత సురక్షితంగా భద్రపర్చామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలకు విడివిడిగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలలో 14 చొప్పున ఇవిఎం కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు ప్రత్యేకంగా ఒక కౌంటింగ్ కేంద్రంలో 20 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందే ఏజెంట్ల వివరాలు ఇవ్వాలని కోరారు. ఏజెంట్లు అందరూ ఓట్ల లెక్కింపు రోజున ఉదయం ఏడు గంటలకు కౌంటింగ్ కేంద్రంలో ఉండాలన్నారు. వారికి కేటాయించిన నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రంలో సంబంధిత టేబుల్ వద్దనే ఏజెంట్లు కూర్చోవాలన్నారు. అనవసరంగా అటు ఇటు తిరగరాదని ఇతర కౌంటింగ్ హాల్లోకి ప్రవేశించరాదన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ, 8.30 గంటలకు ఇవిఎం కౌంటింగ్ మొదలుపెడతామన్నారు. పుంగనూరు

సమావేశంలో మాట్లాడుతున్న అభిషిక్త్ కిషోర్

నియోజకవర్గానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో లెక్కింపు చేసి వివరాలను ఇక్కడికి పంపుతారన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లకు ఐడి కార్డు, బ్యాడ్జి, ఫామ్ 18 జారీ చేస్తామని, అవి చూపించిన వారిని కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. ఈ నెల 25న కౌంటింగ్ స్టాఫ్‌కు మొదటి రాండమైజేషన్, జూన్ 2న రెండవ రాండమైజేషన్, 4వ తేదీ కౌంటింగ్ రోజున ఉదయం 3వ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా జూన్ 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విజయ యాత్రలు, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. ఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద అత్యంత పటిష్టంగా మూడు అంచల విధానంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. జూన్ 6 వరకు జిల్లాలో మోడల్ కోడ్ అమల్లో ఉంటుందని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే ఎవరినైనా ఉపేక్షించమని, పరిధి దాటిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వీలైతే అరెస్టు కూడా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్యనారాయణరావు, పార్లమెంట్ అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, ఆథరైజెడ్ ప్రతినిధులతో పాటు సంబందిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఎపిపిఎస్‌సి పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు : డిఆర్‌ఒ

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌ఒ సత్యనారాయణరావు

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎపి ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ నియామకం కోసం జిల్లాలో ఈ నెల 25న నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని డిఆర్‌ఒ సత్యనారాయణ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఎపిపిఎస్‌సి ద్వారా జిల్లాలో ఈ నెల 25న నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ ఆన్‌లైన్ పరీక్ష కొరకు పరీక్షా కేంద్రాలలో చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో డిఆర్‌ఒ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలలో 1011 మంది అభ్యర్థులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారని చెప్పారు. జిల్లాలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులందరూ ప్రశాంత వాతావరణంలో ఆన్‌లైన్ పరీక్ష రాసేలా సంబంధిత అధికారులందరూ సమయంతో పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్షలను విజయవంతం చేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా పరీక్షా కేంద్రంలో ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు ఏర్పాటు చేసుకోవాలని వైద్య శాఖను, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను, పరీక్షా కేంద్రాలలో పోటీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కాలేజీ చీఫ్ సూపరిండెంట్లకు సూచించారు. ప్రతి కాలేజీకి రెవెన్యూ తరపున ఒక్కొక్క లైజన్ అధికారిని ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆదిత్యా ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లి, మదనపల్లి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు, మదనపల్లి, విశ్వం ఇంజినీరింగ్ కళాశాల, కురబలకోట, భాస్కర్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు, రామాపురం మండలంలో పరీక్ష కేంద్రలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఎఒ గోవింద్ సింగ్, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, పోలీసు, రెవెన్యూ, వైద్య, విద్యుత్, ఆర్టీసీ, కాలేజీ చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ తాత్కాలికంగా వాయిదా

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా పరిధిలోని (ఏడు బాలుర, 12 బాలికల) 19 డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 25వ తేదీన నిర్వహించే స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా సమన్వయ అధికారి ఎల్.మాధవి లత పేర్కొన్నారు. మళ్లీ ఎప్పుడు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించే తేదీలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

'వెలుగు'లో ప్రపంచ మనోవైకల్య దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె మండలం కోళ్ళ బైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో ప్రపంచ మనోవైకల్యం దినోత్సవాన్ని సిబ్బంది, పిల్లల మధ్యన జరుపుకున్నట్లు వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వీటీ మాట్లాడుతూ మినిస్ట్రీ అఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, నేషనల్ ట్రస్ట్ ఆదేశాల మేరకు వరల్డ్ స్కిజోఫ్రీనియా డే మే 24న జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. సిబ్బంది సిల్వర్ కలర్ రిబ్బన్‌ను ధరించి ఈ రోజు యొక్క ప్రాముఖ్యతను చాటారు. స్కిజోఫ్రీనియా అనేది ఒక మానసిక రుగ్మతని, ఈ రుగ్మత బారిన పడిన వ్యక్తులు ఎక్కువ కాలం భ్రమలు, భ్రాంతుల మధ్యన గడిపేస్తారని చివరగా తమ ప్రాణాలకు హాని కలిగించుకుంటున్నారని తెలిపారు. భావితరాలకు, ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం చాల అవసరమని దాన్ని కాపాడుకోవడం మన బాధ్యతని తెలిపారు. ధ్యానం, ప్రార్ధన, మానసికంగా ధృడంగా ఉండడం, ధూమపానానికి, మద్య పానానికి దూరంగా ఉండడం వంటివి చేయాలనీ కోరారు. పాజిటివ్ ఆలోచనలు, పాజిటివ్ వాతావరణంలో మన మందరం ఉండాలని కోరారు. అనుమానాలు, భ్రమల్లో ఉంటూ చాల మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వాటిని అధిగమిస్తూ మనం ముందుకు పోవాలని చెప్పారు. ఈ స్కిజోఫ్రీనియా అనే రుగ్మతకు ఇప్పుడు మంచి మంచి ఔషధాలు కనుగొన్నారని తెలిపారు. రుగ్మత బారిన పడిన వ్యక్తులకే కాకుండా ప్రతిఒక్కరికి మానసిక ఆరోగ్యం కొరకు సైకిలోజిస్ట్, కౌన్సెలింగ్, ప్రాబ్లెమ్ సొల్వింగ్ చాల అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

ఎంపిఎల్ కార్యక్రమంలో పాల్గొన్న వెలుగు సిబ్బంది

చిన్నారి భవిత్ తల్లిదండ్రులకు పురస్కారం అందజేస్తున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

ఏడు నెలల చిన్నారికి అరుదైన గౌరవం

- ప్రతిభకు లభించిన నోబెల్ పురస్కారం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన రామాపురం హరదీప్, హిమజ దంపతుల ఏడు నెలల వయసున్న రామాపురం భవిత్ తన ప్రతిభతో నోబెల్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకొని అందరిచే ఔరా అనిపించుకున్నాడు. చిన్న వయసులోనే వివిధ రకాల పక్షులు, కూరగాయలు, పండ్లు, జంతువులు, పూలు ఫోటోలను గుర్తుపడుతుండటంతో తల్లిదండ్రులు బాబుకు ఉన్న జ్ఞాపకశక్తి ప్రతిభను గుర్తించింది. తన కుమారుడు ఏడు నెలల వయస్సులోనే అద్భుత గ్రహణ శక్తిని మరింత పెంపొందించేందుకు తన బాబుకు వివిధ రకాల జంతువులు కూరగాయలు ఫ్రూట్స్ ఇతరత్రా వాటిని గుర్తు పట్టేందుకు వారు బాబుకు వివిధ రకాల బొమ్మల కార్డ్స్‌తో ప్రయత్నించారు. తన ప్రయత్నం వృథా పోలేదని వారి బాబు ఏకంగా 243 రకాల పక్షులు, కూరగాయలు, పండ్లు, జంతువులు, పూలు ఫోటోలను గుర్తు పడుతుండటంతో ఎలాగైనా తమ కుమారుడి ప్రతిభను ప్రపంచానికి తెలియజేయాలని వీడియోలో రికార్డ్ చేసి పంపడంతో నోబుల్ అవార్డ్ రికార్డ్ వారు గుర్తించి నోబెల్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 21వ తేదీన మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, వన్‌టౌన్ సిఐ వల్లి భషు చేతుల మీదుగా నోబెల్ బహుమతిని తీసుకోవడంతో చిన్నారి భవిత్ చిన్న వయసులోనే ఇంతటి పురస్కారం అందుకోవడంతో తల్లిదండ్రులు ఆనందానికి అవధులు లేవని చెప్పవచ్చు.

హెచ్‌ఐవి చిన్నారుల కోసం చైల్డ్ ఫ్రెండ్లీ సెంటర్

ప్రజాశక్తి-కడప అర్బన్

హెచ్‌ఐవితో జీవిస్తున్న చిన్నారులకు వినోదం విజ్ఞానం కోసం చైల్డ్ ఫ్రెండ్లీ సెంటర్‌ను ప్రారంభించినట్లు వైఎస్‌ఆర్ జిల్లా డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.నాగ రాజు తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వరరెడ్డితో కలిసి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ హెచ్‌ఐవితో జవిస్తున్న పిల్లలు వైఆర్‌జి కేర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ సురేశ్వరరెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఐవి పిల్లలను ఏఆర్టీసీలకు తీసుకురావడానికి తల్లిదండ్రులు సంరక్షకులు మొగ్గుచూపుతారని పేర్కొన్నారు. అదనపు జిల్లా వైద్య అధికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ సేవలను తప్పకుండా వినియోగించుకోవాలని చెప్పారు. తరచూ ఏ ఆర్ టి సెంటర్ వద్దకు తీసుకురావాలని కోరారు. ఆరోగ్యాన్ని మెరుగుపరిచేలా పౌష్టికాహారాన్ని మందులను తీసుకోవాలని తెలిపారు. డిపిఎం భాస్కర్ మాట్లాడుతూ హెచ్‌ఐవితో జీవించడం అంత బాధాకరమైన విషయం కాదని పేర్కొన్నారు. బిపి, షుగర్ వంటి వ్యాధి అని పేర్కొన్నారు. వైఆర్‌జి కేర్ సెంటర్ రాష్ట్ర మేనేజర్ రాజు సెంటర్ ఏర్పాటుకు సహకరించిన జిల్లా వైద్యాధికారి సర్వజన సూపరింటెండెంట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులను గుర్తిస్తున్న అనురాధ

భవిత పిల్లలకు భరోసాను అందిద్దాం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భరోసాను అందిద్దామని మండల సహిత విద్య ఉపాధ్యాయురాలు బి.అనురాధ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా డిఇఒ శివప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని విభిన్న ప్రతిభావంతుల (మూగ, చెవిటి, మానసిక వికలాంగ) పిల్లలను గుర్తించి వారు కూడా పాఠశాలలో చేర్చి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపా యాలను సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు సహిత విద్యా జిల్లా కో-ఆర్డినేటర్ జనార్ధన్, భవిత కేంద్రాలలోని ఉపాధ్యాయులతో కలిసి మండల వ్యాప్తంగా ఇంటింటా సర్వే చేసి వారిని గుర్తించడం జరుగుతుందన్నారు. మూడు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో, ఆరు సంవత్సరాల వారిని పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులను చైతన్యపరిచి అటువంటి పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా విద్యాబుద్ధులను నేర్పిం చడమే ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. మండలంలో గత 20 రోజులుగా ఎంఇఒలు ఎం.ఆర్ పద్మావతి, కె.నారాయణ ఆధ్వర్యంలో సహిత విద్య ఉపాధ్యాయులు బి.అనురాధ, జి.సురేష్‌లు కలసి ప్రతి పల్లెను, అంగన్వాడీ కేంద్రాలను, సచివాలయాలను, ఆరోగ్య కేంద్రాలను సందర్శించి విభిన్న ప్రతిభావంతుల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, ఆదర్శ పాఠశాలలో చేర్పించి వారు కూడా విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఎదిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది సహిత విద్య ఉపాధ్యాయులకు సహాయ సహకారాలు అందిస్తూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు సర్వే విజయవంతం కావడానికి తోడ్పాటును అందిస్తున్నారని పేర్కొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సిఐ సూర్యనారాయణ

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరిగే కౌటింగ్‌కు ప్రజలంతా సహకరించాలని, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఓట్లు లెకింపు జరిగే రోజు ప్రజలు గుంపులు గుంపులుగా గుమి గూడరాదని అన్నారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందుకు ప్రతి ఒక్కరు నియ మ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ రోజున, తరువాత రోజులలో ఎటువంటి ర్యాలీలు, విజయోత్సవాలు నిర్వహించరాదని, బాణాసంచా కాల్చడం నిషేదమని చెప్పారు. ఎవరైనా చట్టవిరుద్ధముగా పోలీసు వారి ఆంక్షలని అతిక్రమించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసు వారు తెలిపిన సూచనలను పాటించి ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

గాలివీడులోని ఓ గృహంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నూలివీడులో నాకాబందీ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని నూలివీడు గ్రామం కస్పాలో శుక్రవారం ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో నాకాబందీ నిర్వహించారు. వీధివీధినా, గృహలలో ఎక్కడ అనుమానం ఉంటే ఆ గృహాన్ని మొత్తం తనిఖీ చేశారు. అనంతరం బస్టాండ్ ఆవరణంలో దుకాణ యజమానులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు కౌంటింగ్ రోజున బస్టాండ్‌లో ఎటువంటి అవాయించిన సంఘటన జరగకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

రేపు గంగమ్మ జాతర

గాలివీడు : మండల పరిధిలోని అరవీడు పంచాయతీ ఉయ్యాలవాండ్లపల్లి వద్ద వెలసిన నల్ల గంగమ్మ జాతర సోమ, మంగళవారంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి చాందిని బండ్లులతో దేవాలయం చుట్టూ ప్రదర్శనలు, మంగళవారం ఉదయం బోనాలు సమర్పిస్తారన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలందరూ జాతర కోసం ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఆ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా ఎస్ఐ వెంకటప్రసాద్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

IN THE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KADAPA

O.S.No. 1056/2021

D.Ifran Khan and 2 others,
All are minors Represented by their mother Natural Guardian by name D.Thameem Khanam D.Thameem Khanam.

...Plaintiffs

Vs

2) D. Khader Valli @ Jamrud, S/o. Late D.Rasool Khan, aged 73 years, Maslim,
3) D.Ibrahim @ Khalee, S/o D.Khader Valli @ Jamrud, aged 50 years, Muslim,
4) D.Ishaq Khan @ Rizwan, S/o D.Khader Valli @ Jamrud, aged 46 years, Muslim,
5) D.Yakub Khan having died his L.Rs. ie., Wife D.Noushin, w/o Late D.Yakub Khan, aged 35 years, Muslim,
All are R/a. D.No.17/2/5/2/5, Nirmala Nagar, Punganur Road, Near Bethel Church, Madanapalli town, Chittoor District.

...Defendants

SUMMON-NOTICE

దావాదారులు మీ పైన దావా O.S.No. 1056/2021 గా 1వ ప్రతివాది రూ.10,000/- నెలకు మెయింటెనెన్స్‌కు మరియు 1 నుంచి 5 ప్రతివాదులు మొత్తమును బ్యాంకు అకౌంట్‌లో డిపాజిట్ చేయమని దావా వేసి, I.A. 829/2021 లో డబ్బు చెల్లించని పక్షములో షెడ్యూలు ఆస్తిని జప్తు చేయవలెనని పిటిషనను వేయగా మీరు తీసుకొననందున మీరు పై కోర్టులో 27.6.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై తెల్పుకోనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

SCHEDULE

1st Item:
Kadapa District, Kadapa Sub-district, Kadapa Village Sy.No.30/2B/1A 1 to an extent of 56.46 Sq. Yards bearing R.K. Complex D.No.19/689, 19/690 and 19/698 of R.K.M. Street.

BOUNDED:
East: Rahamathunnissa Begum Property
West: S. Bilal and S. Maqbul Basha property
North: S. Ghouse Peer and Afzal Jahan property
South: P. Karimulla Khan property

2nd Item:
Kadapa District, Lakkireddipalli Sub-district, Ramapuram Mandalam, Gopagudipalli Village fields bearing Sy.Nos.
1) S.No.490 to an extent of Ac.2.00 Cents Full
2) S. No.491/1 to an extent of Ac.1.50 Cents Full
3) S. No.491/2 to an extent of Ac.0.49 Cents Full
4) S.No.491/3 to an extent of Ac.0.22 Cents Full
5) S.No.494 to an extent of Ac.0.84 Cents Full
6) S.No.489 to an extent of Ac.0.41 Cents Full
7) S.No.492 to an extent of Ac.0.94 Cents Full
Total: Ac.6.40 Cents Full

//By Court Order//

S.MASTHAN VALLI, M.Com.,L.L.B.,
Advocate & Notary,
Kadapa.

మహారాజశ్రీ పీలేరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 1 of 2022

గరుడాచలం ఉదయ కుమార్‌రెడ్డి. ...వాది

Vs

బెడదలూరి కరమతుల్ల మరియు ఇంకొకరు.

...ప్రతివాదులు

1& 2వ ప్రతివాదులకు సమను:

1వ ప్రతివాది: బెడదలూరి కరమతుల్ల, S/o బి.శిలార్ సాహెబ్,
2వ ప్రతివాది: గుమ్మదురు కమినిష, W/o బెడదలూరి కరమతుల్ల,
1మరియు 2 నివాసము: డోర్ నెం.4-138, పాత సంత గేటు వీధి, కలికిరి టౌన్, పోస్ట్ & మండలం, అన్నమయ్య జిల్లా.

పై కనిన వాది దాఖలు చేసిన పై దావాలో మీ హాజరు నిమిత్తమై తేది: 28.06.2024న వాయిదా వేసిఉన్నారు, కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని, తేది: 28.06.2024న వాయిదా వేసి వున్నారు, కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని, తేది: 28.06.2024న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ఎదుట హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను, లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

//By Court Order//

కె.సుధాకర్‌రెడ్డి, పి.వి.రమణారెడ్డి
న్యాయవాదులు,
పీలేరు.

మండుతున్న ఎండలతో.. జనం ఉక్కిరి బిక్కిరి

- ఉపశమనం కలిగించని వర్షాలు
- పెరిగిన విద్యుత్ వాడకం
- శీతల పానీయాలకు మంచి డిమాండ్

ఎండ తీవ్రతకు నిర్మాణుష్యమైన హైవే రోడ్లు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఈ యేడాది వేసవి ప్రారంభం కాకముందే ఫిబ్రవరి నుంచే మొదలైన ఎండల తీవ్రత మే చివరి వారం అయినా కూడా ఏమాత్రం తగ్గడం లేదు. గత వారం రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలు వల్ల కూడా ఉపశమనం కలిగించలేదని ప్రజలు వాపోతున్నారు. దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎండ తీవ్రత, ఉక్కపోతకు విలవిలలాడుతున్నారు. ఎసిలో ఉండే సంపన్నులు మినహా పేద, మధ్యతరగతి ప్రజలు అటు బయటకు రాలేక ఇటు ఇళ్లలో ఉండలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వీట న్నింటినీ తట్టుకోవడానికి విద్యుత్ పరికరాలను ఆశ్రయిస్తే విద్యుత్ బిల్లు బాదేస్తుంది. సాధారణ బిల్లు కంటే రెండింతలు దాటి రావడానికి చూసి సామాన్యుడు భయపడుతున్నారు. ఇంతకాలం అదనపు బాదుడైన సర్‌చార్జీలు, కస్టమర్ చార్జీలు, ఫిక్స్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ తదితర పేర్లతో ప్రభుత్వం ఎడాపెడా వసూలు చేసింది గడిచిన నాలుగు రోజుల నుంచి ఎన్నడూ లేనంతగా రోజువారి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు నమోదు అవుతున్నాయి. మండే ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ఇళ్లలో ఉండలేకపోతున్నారు. ఉదయం 9 గంటలకే సూర్యుని భగభగలు బయటకు రాకుండా చేస్తున్నాయి. సాయంత్రం ఐదు గంటలైనా ఉక్కపోత తగ్గడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం పుల్లంపేటలో ప్రధాన రహదారులే కాదు వీధులన్నీ నిర్మానుష్యంగా మారిపో తున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. చల్లటి గాలినిచ్చే విద్యుత్ పరికరాలను ఎక్కువగా వాడుతున్నారు. రాత్రింబవళ్లు ఎండ వేడిమి, ఉక్కపోతకు తట్టుకోలేక ఇళ్లలో కూలర్లు, ఫ్యాన్లు, ఎసిల వాడకం ఎక్కువగా ఉంటుంది. ఐదు నిమిషాలు కరెంటు పోయినా భరించలేకపోతున్నారు. ఇలా నిరంతరం విద్యుత్ వాడకం పెరగటంతో విద్యుత్ మీటర్ కూడా గరున తిరుగుతుంది. యూనిట్లు పెరిగి స్లాబ్ మారడంతో వినియోగదారుని గుండె గుబెల్ మంటుంది. కూలర్, ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్ (ఏసి), వాడకమే కాదు వాటి వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కూలర్లు ఫ్యాన్లనే ఎంపిక చేసుకుంటున్నారు. పట్టణంలో కూలర్లకు డిమాండ్ ఏర్పడటంతో వ్యాపారులు బాగా క్యాష్ కూడా చేసుకుం టున్నారు. ఎయిర్ కూలర్ కనిష్టంగా 8000 నుంచి 18 వేల వరకు విక్రయిస్తున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే వీటి ధరలు కొంత పెరిగాయని వినియోగదారులు చెప్తున్నారు. ఇక స్టాండింగ్ ఫ్యాన్ కూడా రెండు వేల నంచి 5వేల వరకు విక్రయిస్తున్నారు.పుష్కలంగా వర్షాలు కురిసి వాతావరణంలో మార్పు వచ్చేవరకు ఇదే పరిస్థితి ఉంటుందని పలువురు అంచనా వేస్తున్నారు.

రోడ్డుపై జ్యూస్ బండి సిద్ధం చేసుకుంటున్న వ్యాపారి

అమ్మకాని సిద్ధంగా ఉంచుకున్న ఎయిర్ కూలర్లు

విద్యా కానుక స్టాక్ పాయింట్ తనిఖీ చేసిన డిఇఒ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలోని విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను డిఇఒ రవిప్రకాష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జూన్ 12 పాఠశాలల ప్రారంభం తర్వాత విద్యా కానుక కిట్లను పంపిణీకి సిద్ధంగా ఉంచాలని ఎంఇఒలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్యలకు సూచించారు. అనంతరం ఎంఆర్‌సి కార్యాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ సమయపాలనను కచ్చితంగా పాటించాలని సూచించారు. నాడు-నేడు పనులపై సమీక్షించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

ఎంఆర్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ రవిప్రకాష్‌రెడ్డి

బకాయి బిల్లుల చెల్లింపునకు అవకాశం కల్పించండి

ఖజానా శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

పిఆర్‌సికి ముందు చెల్లించాల్సిన డిఎ బకాయిల బిల్లుల చెల్లింపునకు అవకాశం కల్పించాలని కడప జిల్లా ఖజాన శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లను యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. శుక్రవారం జిల్లా ఖజానా కార్యాలయంలో ఖజాన శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లును కలిసి యుటియఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కడప మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన జూలై 2018, నుంచి 2021, జూన్ వరకు 60 నెలలకు సంబంధించిన పది విడతల డిఎ అరియర్స్ బిల్లులు అనేక మార్లు ఖజానా శాఖకు సమర్పిం చినప్పటికీ వాటిని ఆమోదించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం తిరిగి బిల్లులు సమర్పించడానికి అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. డిఎ అరియర్స్‌కు సంబంధించిన టైల్స్ డిడిఒ లాగిన్‌లో ఓపెన్ చేయవలసిందిగా కోరారు. జిల్లాల విభజన తదితర కారణాల వల్ల చాలామంది ఉద్యోగ, ఉపాధ్యాయులు బిల్లులు సమర్పించలేక పోయారని చెప్పారు. వాటిని ప్రస్తుతం సమర్పించుటకు అవకాశం కల్పించాలని కోరారు. ఖజానా శాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా బిల్లులు సమర్పించుటకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి. రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, వీరన్న పాల్గొన్నారు.

వైవీయూ అభివృద్ధిని ప్రశ్నార్థకం చేస్తే సహించం

ప్రజాశక్తి - కడప అర్బన్

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఉన్న ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి రాజకీయ పలుకుబడితో వైవీయూను నీరుగారుస్తున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న విమర్శించారు. శుక్రవారం పిడిఎస్‌యు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే భవనాల అప్పగింత ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధాన పరిపాలన, ఇతర భవనాలు డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయంకు ఇవ్వడం సరైన నిర్ణయం కాదని తెలిపారు. తక్షణమే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఉన్నత ప్రమాణాలతో యోగివేమన విద్యాలయంకు పేరుందని చెప్పారు. పరిశోధనల్లో, విద్యా బోధనల్లో అత్యున్నత స్థాయి పేరుందని తెలిపారు. మరే ఇతర విశ్వవిద్యాలయాల్లో లేని విధంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన అధ్యాపక బృందం వైవీయూలో ఉందన్నారు. వారి పరిశోధనలతో మంచి పేరు వర్సిటీకి వచ్చిందని చెప్పారు. ఇక్కడ పరిశోధనలు చేసిన విద్యార్థులు అనేక దేశాల్లో పరిశోధకాలుగా ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. వైవీయూకు అనుబంధంగా డిగ్రీ, పీజీ,లా, ఫిజికల్ ఎడ్యుకేషన్, బిఎడ్ కళాశాలలతో పాటు దూర విద్యతో వర్సిటీ ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ తరుణంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అయినా ఇసి సురేంద్రనాథ్ రెడ్డి తన మనుగడ కోసం వైవీయూను దెబ్బ తీయాలని చూస్తున్నాడని విమర్శించారు. వర్సిటీకి కేంద్రం అయినా పరిపాలన భవనాన్ని, ఇతర ప్రధాన భవనాలను ఆర్చిటెక్చర్ యూనివర్సిటీకి ఇచ్చే నిర్ణయాన్ని వైవీయూ అధికారులు వెనక్కు తీసుకోవాలన్నారు. వాస్తవానికి వైవీయూ అధికారులు కూడా ఇసి సురేంద్రనాథ్ రెడ్డితో మిలాఖత్ అయ్యారన్నారు. అందువలనే వైవీయూ అధికారులు ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వచ్చాయని డొంకతిరుగుడు మాటలు మాట్లాడుతున్నారన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయానికి తరగతుల నిర్వహణకు గురుకులం బిల్డింగులు ఇవ్వాలని పిడిఎస్‌యు గా డిమాండ్ చేస్తుందన్నారు. వైవీయు మీద రుద్దాలని చూస్తే సహించమన్నారు. సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్, నగర కార్యదర్శి మనోజ్ పాల్గొన్నారు.

32 వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్య

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

భక్తగ్రేసరుడైన అన్నమయ్య 32వేల సంకీర్తలను రచించి సమాజానికి అందించారని టిటిడి మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయసేవాకేంద్రంలో శుక్రవారం పద కవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32వేల అన్నమయ్య కీర్తనలలో ప్రస్తుతం 12వేల మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయన్నారు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి కృషి వల్ల అన్నమయ్య పదసాహిత్యం మనకు లభించారని చెప్పారు. మరో టిటిడి మాజీ సభ్యుడు టంగుటూరి మారుతీప్రసాద్ మాట్లాడుతూ పండిత పామరులకు సులభగ్రాహ్యంగా అన్నమయ్య పదాలను రచించారన్నారు. మామూలు మాటలతో గంభీరమైన వేదాంత విషయాలను కూడ చెప్పారన్నారు. ఉపాద్యాయసంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తెలుగునుడికారం స్వచ్ఛమైన భావన సంపద అన్నమయ్య పదాలలో అడుగడుగునా కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ భావవతార్ ఎడవల్లి రమణయ్య రాష్ట్రభాషోపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, కోశాధికారి భోగాగంగాధర్, ఉపాధ్యక్షులు సాయికుమార్, వారాది మధు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులరెడ్డి,పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

ప్రజాశక్తి - వేంపల్లె

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు రాకుండా ఉంటాయని డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాజాముద్దీన్ అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెస్తవారిపల్లెలో ప్రజలకు శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రత లేకపోతే ప్రజలకు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులు దోమల ద్వారా వస్తాయని చెప్పారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం ప్రజలందరూ డ్రైడేగా భావించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. నీటి నిల్వ ఉన్న చోట దోమలు ఉద్ధి చెందుతాయని చెప్పారు. లార్వా నుంచి దోమగా మారడానికి దోమగా మారుటకు 10 రోజుల సమయం పడుతుందని చెప్పారు. లార్వా దోమగా మారక ముందే 7వ రోజున నీరు నిల్వ ఉంచిన తొట్లు, బానలు, డ్రమ్ముల నుంచి నీటిని పారబోసి వాటిని టెంకాయపీచుతో బాగా శుభ్రపరచాలని కోరారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ లార్వా దశలోనే దోమల్ని నాశనం చేసేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో ఉన్న వారందరూ ఒకే రోజు డ్రైడేని పాటిస్తే డెంగీ, మలేరియా జ్వరాలను సమర్థవంతంగా అరికట్ట వచ్చు అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, నాగేశ్వర్, సిహెచ్ఓ వీణా కుమారి, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు

ఘర్షణలకు దూరంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఎన్నికల అనంతరం ఫలితాలు వెలబడుతున్న నేపథ్యంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డిఎస్‌పి వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారంసింహాద్రిపురంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో ఎన్నికలు సజావుగా ముగిశాయని, ఫలితాలు అనంతరం ఎలాంటి ఘర్షణలు దిగిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాలలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా ఫలితాలు అనంతరం అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ బాల మద్దిలేటి, ఎస్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భోజనంతో పాటు నగదును అందిస్తున్న నరసింహులు

ఆశ్రమ విద్యార్థులకు అన్నదానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లె నియోజకవర్గం, పెద్దతిప్పసముద్రం మండలం కమ్మ చెరువు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నరసింహులు జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మదనపల్లిలోని చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కానిస్టేబుల్ నరసింహులు మాట్లాడుతూ ప్రతి ఏడాది పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ ఏడాది చైతన్య స్వచ్ఛంద సేవా సమితి ఆశ్రమ విద్యార్థుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకొని, వారికి ఒక్కపూట భోజనం తోపాటు ఐదు వేల రూపాయలు భోజనానికి తనవంతు సహకారం అందించినట్లు తెలిపారు. పుట్టినరోజు వేడుకలను గొప్పగా జరుపుకోవడం వల్ల ధనం వృధా కావడం తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. ఆ డబ్బుతో చాలామంది నిరుపేదలు, అనాధలకు ఒక్క పూట ఆకలి తీర్చిన సార్థకం ఉంటుందని అన్నారు. అనంతరం ఆశ్రమ విద్యార్థులు కానిస్టేబుల్ నరసింహులుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తన మిత్రుడు కానిస్టేబుల్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థికి నియామక పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపల్ సోమశేఖర్

సాంకేతిక విద్యతో ఉపాధి

ప్రజాశక్తి-కలికిరి

సాంకేతిక విద్యతోనే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కంపెనీలు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 36 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సోమశేఖర్ ఎంపికైన విద్యార్థులకు నియా మక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కూడా తమ భవిష్యత్ కార్యా చరణను మార్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలి పారు. ఈ సంద ర్భంగా వివిధ కంపెనీలకు ఎన్నికైన విద్యార్థులను వారు ప్రశంసించారు.

ఘనంగా మల్లాలమ్మ తిరుణాల

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలం లోని సి.గొల్లపల్లి పంచాయతీలో రెక్కలకొండపల్లిలో వెలసిన శ్రీ మల్లాలమ్మ తిరు ణాలను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు బోనాలు, చాందిని బండ్లతో, బాణా సంచా వేడుకలతో తిరుణాలను జరుపుకున్నారు. దేవాలయం దగ్గర కాలక్షేపం కొరకు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు.

రైతు వాటా ధర చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి- చక్రాయపేట

ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసుకునే రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ ధర పోను, రైతు వాటా చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి నవంత్ బాబు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణ రకం వేరుశనగ 30 కిలోల బస్తా పూర్తి ధర రూ 21 90 కాగా, ప్రభుత్వం సబ్సిడీ రూ 1164 పోను మిగిలిన రైతు వాటా రూ 1746 చెల్లించాలన్నారు. కె-6 రకం విత్తనాలు రూ. 2850 సబ్సిడీ రూ1140 పోను మిగిలిన రైతు వాటా రూ1710 చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి బుధవారం నుంచి వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తామని తెలిపారు. నారాయణ 1000 క్వింటాళ్లు, కే సిక్స్ 400 క్వింటాలు. మంజూరైనట్లు వారు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ లింక్ అయినా సెల్ తీసుకెళ్లాలన్నారు.

క్రైం కార్నర్

గాయపడిన వెంకటరమణ పరామర్శిస్తున్న ముక్కా వరలక్ష్మి

లారీ బైక్ ఢీ : వ్యక్తి మృతి

- బాధితులను పరామర్శించిన ముక్కా వరలక్ష్మి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కడప తిరుపతి నేషనల్ హైవే అప్పయ్యపేట పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పెనగలూరు మండలం కొండూరు గ్రామా నికి చెందిన పసుపులేటి సుబ్బ నరసయ్య, తోట వెంకటరమణ అనే ఇరువురు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఇద్దరిని లారీ ఢీకొట్టిందని చెప్పారు. ఈ ప్రమాదంలో పసుపులేటి సుబ్బనరసయ్య మృతిచెందగా తోట వెంకటరమణకు గాయాల య్యాయని తెలిపారు. క్షతగాత్రుడిని హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. విషయం తెలుసుకున్న నియో జకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణను పరామర్శించి భరోసా నిచ్చారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మినీ టెంపో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో శుక్రవారం ఉదయం చోటుచేస్తుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని గుండ్లపల్లి పంచాయితీ పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన చలపతి, మలిగివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి, శుక్రవారం ఉదయం సొంత పనులు నిమిత్తం ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లికు బయలుదేరారని తెలిపారు. చెన్నప్పగారిపల్లె సమీపంలో మలుకువలో ఎదురుగా వస్తున్న మినీ టెంపో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టినట్లు తెలిపారు.ఈ ప్రమాదంలో వెంకటరమణారెడ్డి, చలపతి తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. స్థానికులు వెంటనేపభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.